www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 ఏప్రిల్ 2023



మున్సిపల్ కార్మికుల బకాయిలు చెల్లించండి

ఏలూరు: మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రావాల్సిన మార్చి నెల జీతం, మూడు నెలల హెల్త్ అలవెన్స్‌లు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు ఆర్.నాగరాజు, కార్యదర్శి ఎ.జాన్‌బాబులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులకు ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు పదో తేదీ వచ్చినప్పటికీ జీతాలు చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. ఒక్కో కార్మికుడికి ప్రభుత్వం రూ.50 వేల వరకూ బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. బకాయి జీతాలు, బకాయి హెల్త్ అలవెన్స్ ల కోసం ఈనెల 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ పిలుపులో భాగంగా జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాలిటీల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

వీక్లీ ఆఫ్ అమలేది..!



ప్రభుత్వ హామీలు బుట్టదాఖలు

రెండు జిల్లాల్లోనూ అమలు కాని వీక్లీఆఫ్

'పశ్చిమ' ఎస్‌పి ఆదేశాలిచ్చినా స్టేషన్ అధికారులు బేఖాతరు

గుగూల్ షీట్‌లో వీక్లీఆఫ్ లెక్కల మాయాజాలం

చూసీచూడనట్లుగా స్పెషల్ బ్రాంచ్ అధికారులు

మహిళా పోలీసులకు అనధికారిక విధులు?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీస్ సిబ్బందికి ప్రకటించిన వీక్లీఆఫ (వారాంతపు సెలవు) ఇప్పటికీ అమలుకాని పరిస్థితి నెలకొంది. 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అనే చందంగా పోలీసుల వీక్లీ ఆఫ్ తయారైంది. పోలీస్ ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకున్నది. ఒత్తిడిని తగ్గించి కుటుంబంతో గడిపేందుకు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోలీసులకు వారాంతపు సెలవు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ పోలీసుల వీక్లీఆఫ్ సక్రమంగా అమలుకాని పరిస్థితి నెలకొంది. కొన్ని జిల్లాల్లో ఎస్‌పిలు వీక్లీ ఆఫ్ ఆమలుపై ఆదేశాలిచ్చినా స్టేషన్ అధికారులైన సిఐ, ఎస్ఐలు అమలు చేయని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 2500 మంది వరకూ పోలీస్ సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంలో ఒకరోజు వీరికి వీక్లీ ఆఫ్ అమలు చేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఎక్కడా అమలు కావడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో వీక్లీఆఫ్ అమలుపై ఎస్‌పి రవిప్రకాష్ ఆదేశాలచ్చినా అమలు చేయని దుస్థితి నెలకొంది. సిబ్బందికి వీక్లీ ఆఫ్ వివరాలను ప్రతిరోజూ గూగుల్ షీట్‌లో నమోదు చేయాలని ఎస్‌పి ఆదేశించారు. సిబ్బందికి వీక్లీఆఫ్ ఇవ్వకపోయినా గూగుల్ షీట్‌లో నమోదు చేస్తూ ఉన్నతాధికారులను ఏమారుస్తున్నట్లు తెలిసింది. ఎస్‌పికి రెండు కళ్లలా వ్యవహరించాల్సిన స్పెషల్ బ్రాంచ్ అధికారులు సైతం ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియపరచకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. గూగుల్ షీట్‌లో నమోదు చేసిన తర్వాత వీక్లీ ఆఫ్ ఇవ్వకపోవడంపై సిబ్బందిలోనూ తీవ్ర ఆవేదన నెలకొంది. వీక్లీఆఫ్ అమలులో కొనసాగుతున్న నిర్లిప్తతను సిబ్బంది మౌనంగా భరిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేక, స్టేషన్ అధికారులను అడగలేక సతమతమవుతున్న పరిస్థితి ఉంది. పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలుపై ప్రభుత్వం సైతం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి అమలు చేసేలా పర్యవేక్షించాలని సిబ్బంది కోరుతున్నారు.

అనధికారికంగా మహిళా పోలీసులకు విధులు

మహిళా పోలీసులుగా పిలుస్తున్న (సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు)కు పోలీస్ అధికారులు అనధికారికంగా విధులు కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయించకూడదు. సచివాలయ ఉద్యోగులకు వర్తించే సెలవులు, కార్యాలయానికి వచ్చే సమయానికి సంబంధించిన నిబంధనలే వీరికి వర్తిస్తాయి. అయితే మహిళా పోలీసులకు నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయిస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయించబోమని ప్రభుత్వం కోర్టుకు సైతం తెలిపింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. సిఎం పర్యటనలు, ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ రాత పరీక్షల కేంద్రాల వద్ద బందోబస్తుకు మహిళా పోలీసులను ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులకు టిఎ, డిఎలు వర్తిస్తాయి. సిఎం పర్యటన మధ్యాహ్నానికి అయిపోతే పోలీస్ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లిపోతారు. అదే మహిళా పోలీసులైతే సచివాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటికెళ్తే పంచాయతీ కార్యదర్శి ఊరుకోరు. మహిళా పోలీసులకు అనధికారికంగా విధులు కేటాయించడం వల్ల ఏఒక్క సౌకర్యమూ వీరికి వర్తించడం లేదు. దీంతో ఛార్జీల వంటి ఖర్చులు సొంతంగానే భరించాల్సిన దుస్థితి నెలకొంది. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులకు విధులు కేటాయించాలి. అయితే ప్రస్తుతం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒకరిద్దరు మహిళా పోలీసులకు విధులు కేటాయించారు. పోలీస్ సిబ్బందికి విధుల కేటాయింపునకు సంబంధించి ఇచ్చే పాస్‌పోర్టు వంటివేమీ వీరికి ఇవ్వడం లేదు. సచివాలయ ఉద్యోగులు ఉదయం పది గంటలకు విధులకు హాజరుకావాలి. అయితే మహిళా పోలీసులను ఉదయం ఎనిమిదిగంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు పంపిస్తున్నారు. మధ్యాహ్నం రెండుగంటల వరకూ విధులు నిర్వహించి మళ్లీ సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు అర్ధరాత్రి వరకూ కూడా విధులు నిర్వహించాల్సి వస్తోంది. మహిళా పోలీసుల విధుల విషయంలో స్టేషన్ అధికారులు తీరు వివాదాస్పదంగా మారుతోంది. మహిళా పోలీసుల విధుల విషయంలోనూ జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిబంధనలు అమలు చేయాలని అంతా కోరుతున్నారు.



జీతం తక్కువ.. నిబంధనలు ఎక్కువ..!

సవాలక్ష సమస్యలతో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు సతమతం

ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.మూడు లక్షల పూచీకత్తు తప్పనిసరి

ఉద్యోగానికే టెండర్ పెట్టేలా ఏజెన్సీ నిర్ణయం

ఆందోళనలో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమవరం

వాళ్లంతా ఎంటెక్, బిటెక్, డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదివిన వారే. ఉద్యోగావకాశాలు లేక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చిరుద్యోగులుగా చేరారు. వీరికి జీతం తక్కువ.. నిబంధనలు ఎక్కువ. వీరికి జీతభత్యాలు చెల్లించే ఒక ఏజెన్సీ తీసుకున్న నిర్ణయాలపై ఆ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఉద్యోగం ఉండాలంటే రూ.3 లక్షలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగి పూచీకత్తు తప్పనిసరి అని నిబంధన పెట్టింది. ఇది చాలదన్నట్లు ప్రభుత్వ ఉద్యోగి రూ.40 వేలు వేతనం కలిగి ఉండాలని, ఐడి కార్డు, పే స్లిప్‌లు కూడా ఇవ్వాలని హుకుం జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల చిరుద్యోగులు సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారు.

నాలుగేళ్ల క్రితం జగన్ తన పాదయాత్రలో మద్యపాన నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా హామీ అమలు చేయకపోగా ప్రభుత్వమే మద్యాన్ని అమ్మించే పరిస్థితికి వచ్చింది. మొదట్లో మద్యాన్ని నియంత్రిస్తున్నామని చెబుతూనే మద్యం అమ్మకాలు ప్రధాన ఆదాయ వనరుగా భావించి ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతను ఎక్సైజ్ శాఖ చూస్తోంది. ఉన్న ఊరిలో ఉద్యోగం కావడంతో జీతం తక్కువైనా అప్పట్లో మద్యం దుకాణాల్లో పని చేసేందుకు ఉన్నత విద్యావంతులు సైతం క్యూ కట్టారు. ఉన్న ఉద్యోగమే గొప్ప అని సర్దుకుపోతున్నారు. అయితే ఇప్పుడు వారి ఉద్యోగ భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి. కఠిన నిబంధనల పేరుతో కొలువులకు ఎసరు పెట్టేందుకు ఏజెన్సీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే యువకుల దీనగాథ మాటల్లో చెప్పలేనిది.

జిల్లా వ్యాప్తంగా 109 మద్యం దుకాణాలు ఉన్నాయి. సుమారు 387 మంది వీటిలో పని చేస్తున్నారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టింది. సేల్స్‌మెన్‌కు ఇంటర్ అర్హత, సూపర్‌వైజర్ పోస్టుకు డిగ్రీ అర్హతతో నియామకాలు చేపట్టారు. అయితే ఉద్యోగ ఖాళీల భర్తీ చేపట్టకపోవడం తదితర పరిణామాల రీత్యా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చేసిన వారు సైతం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసేందుకు ముందుకొచ్చారు. అయితే అప్పట్లో విధులు సాఫీగా సాగినప్పటికీ రానురాను చిరుద్యోగం సైతం పెనుభారంగా మారింది. తాజాగా ఏజెన్సీ నిర్వాకంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఏజెన్సీలతో తలనొప్పులు

మొదట్లో ప్రభుత్వమే ఉద్యోగ నియామకాలు చేపట్టి సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మెన్స్‌కు రూ.18,500 జీతభత్యాలు ఇచ్చేలా నిర్ణయించింది. పిఎఫ్ కటింగ్ పోను ప్రస్తుతం సూపర్‌వైజర్‌కు రూ.19,500, సేల్స్‌మెన్‌కు రూ.17,500 చేతికొస్తుంది. వీరికి జీతభత్యాలు చెల్లించేందుకు 2019లో రెడ్డిఅండ్‌రెడ్డి ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. నాలుగేళ్లపాటు ఈ ఏజెన్సీ నిర్వహణ బాధ్యత చూసింది. అయితే అప్పట్లో ఈ ఏజెన్సీ ఉద్యోగులను ముప్పుతిప్పలు పెట్టింది. ఈ ఏజెన్సీ ప్రతినెలా సక్రమంగా జీతాలు ఇచ్చిన దాఖలాల్లేవని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో 2022లో ఉద్యోగ నిర్వహణ బాధ్యతను థర్డ్ ఎంప్లాయిస్ ఏజెన్సీకి అప్పగించారు. ఇటీవల కొత్తగా ఏజెన్సీ తీసుకొచ్చిన నిబంధన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న వందలాది మంది యువకుల నెత్తిన పిడుగు పడినంత పనైంది. ఈ ఏజెన్సీ విధించిన నిబంధనలు ఉన్న ఉద్యోగాన్ని ఊడగొట్టే విధంగా ఉన్నాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 లక్షలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పూచీకత్తు తప్పనిసరి

మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా చేరే సమయంలో వారి ఆస్తి దస్తావేజులు పెట్టి, లేదా బాండ్‌పేపర్లపై సంతకాలు చేసి ఉద్యోగాల్లో చేరారు. నాలుగేళ్ల అనంతరం థర్డ్ ఎంప్లాయిస్ ఏజెన్సీ కొత్త నిబంధన తీసుకొచ్చింది. మద్యం దుకాణాల్లో పని చేయాలంటే రూ.3 లక్షలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల చేత పూచీకత్తు సంతకాలు తీసుకు రావాలని హుకుం జారీ చేసింది. అంతేకాకుండా సదరు ప్రభుత్వ ఉద్యోగి ఐడి కార్డు, పే స్లిప్‌లు కూడా ఇవ్వాలని పేర్కొంది. ఇవన్నీ సమర్పిస్తేనే ఉద్యోగం ఉంటుందని, లేకపోతే తీసేస్తామని ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇది చాలదన్నట్లు సదరు ప్రభుత్వ ఉద్యోగి జీతం రూ.40 వేలకు తక్కువ కాకుండా ఉండాలనే నిబంధన కూడా పెట్టింది. ఒక సర్టిఫికేట్ మీద గెజిటెడ్ సంతకం చేయమంటేనే ఉద్యోగులు భయపడిపోయే పరిస్థితుల్లో అలాంటిది పూచీకత్తు సంతకం, ఐడి కార్డు, పే స్లిప్‌లు ఎలా ఇస్తారని సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏజెన్సీ తీసుకొచ్చిన నిబంధనలు అసలు ఉద్యోగం ఉంచడానికా, తీసేయడానికా అనే విధంగా ఉన్నాయని మద్యం దుకాణాల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా ఇటు ఏజెన్సీ, అటు ఎక్సైజ్ అధికారుల నుంచి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చిరుద్యోగులు మానసిక ఒత్తిడికి గురై ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.


కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధుల నిర్వహణ

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి కనీస ఉద్యోగ భద్రత లేనప్పటికీ సదరు ఉద్యోగులు మద్యం దుకాణాల్లో పని చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది ప్రాణాలు పోగొట్టుకోవడంతోపాటు మరికొంతమంది తీవ్ర అనారోగ్యానికి గురై వేలాది రూపాయలు వైద్యానికి ఖర్చుపెట్టిన ఘటనలూ ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం తీసుకొస్తున్న తమ పట్ల ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని సంబంధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ నిర్ణయాలను ఉపసంహరించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ యార్లగడ్డ శ్రీదేవి తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ముసునూరు, నిమ్మకూరు, పులిగడ్డ పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఇంగ్లీషు మీడియంలో చదువుకునేందుకుగాను ప్రస్తుతం నాలుగో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలికలకు నిమ్మకూరు, ముసునూరు, బాలురకు పులిగడ్డ, నిమ్మకూరు పాఠశాలలో సీట్లు కేటాయించామని తెలిపారు. ఇతర వివరాల కోసం 9866559629 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చన్నారు. అలాగే ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల వారికి నిమ్మకూరు, పులిగడ్డ పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయని, దరఖాస్తు చేసుకోచ్చని చెప్పారు.



విరాళం అందిస్తున్న దాతలు

చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం


ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఏలూరుకు చెందిన కర్రి శివశంకర్ ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు చెక్కును ఆలయ ఎఇఒ కెవిఎస్.రాజుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి వారు అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి విరాళానికి సంబంధించిన బాండ్‌ను అందించారు.

అగ్నిబాధితులకు వైష్ణవి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అమరావతి మాజీబ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఆదివారం అర్థిక సాయం అందజేశారు.



సాయం అందిస్తున్న దాత

మండలంలోని గురజ ఎస్‌టి కాలనీకి చెందిన వంగా రఘుబాబుకు చెందిన తాటాకు ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంటికి నిప్పంటుకుని ఇంటిలోని వస్తువులన్నీ కాలిబూడిదయాయి. దీంతో కుటుంబసభ్యులు కట్టుబట్టలతో రోడ్డునపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వైష్ణవి తన తండ్రి డాక్టర్ అంబుల మనోజ్ ద్వారా బాధిత కుటుంబానికి రూ. ఐదు వేలు నగదు, గ్యాస్ పొయ్యి, నెలకు సరిపడు నిత్యావసర సరకులు అందచేశారు. అదేవిధంగా మందుల షాపు యజమాని జిలాని రూ.రెండు వేలు నగదు అందించారు.

పూలే జయంతిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల 11వ తేదీన స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను జయప్రదం చేయాలని బిసి సాధికార సమితి రాష్ట్ర నాయకులు చిట్టిబోయిన రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బిసి సాధికార సమితి ఆధ్వర్యంలో పూలే జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పూలే జయంతి, బిసిల సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి పితాని సత్యనారాయణ, ఎంఎల్‌సి దువ్వారపు రామారావు, నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, రాజమండ్రి టిడిపి ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి శ్రీనివాస్, అఖిలభారత గౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సాధికార సమితి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కొంచాడ ఉమాప్రసాద్, బిసి నాయకులు పాకనాటి అంజి, భూసా సత్యనారాయణ, కోనేటి చంటి, గెడా సుబ్రహ్మణ్యం, దొప్పసాని అన్నవరం(పండు), ఈర్ని సూరిబాబు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

ఉచిత వైద్యసేవలు వినియోగించుకోండి


బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్టు ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్ ఛైర్మన్ పసల సూర్యారావు కోరారు. ఆదివారం పట్టణ శివారు బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో స్థానిక బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పసల సూర్యారావు మాట్లాడుతూ ఈ కాలంలో వైద్యం అందని కారణంగా సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ద్వారా పేదలకు వైద్యం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు వజ్ర కిరణ్, డాక్టర్ సునీత, ప్రజా వైద్యశాల వైద్యులు డాక్టర్ కోట సుబ్బారావు రోగులకు ఉచితంగా షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వంగా గోపి, నాయుడు వెంకటేశ్వరరావు, చల్లారి మాణిక్యాలరావు, ప్రజాసంఘాల నాయకులు బొడ్డు రాంబాబు, షేక్ సుభాషిణి, ప్రభాకర్‌రావు, రామచంద్రరావు, బొడ్డు యశ్వంత్, యువజన సంఘం నాయకులు షేక్ మాబుసుభాని పాల్గొన్నారు.

పెదపాలపర్రులో మెగా వైద్య శిబిరం

ముదినేపల్లి : మండలంలోని పెదపాలపర్రులో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి తల్లిదండ్రులు మైనర్‌బాబు దంపతుల జ్ఞాపకార్థం నిర్వహించిన వైద్యశిబిరంలో పెద్దసంఖ్యలో పలువురు గ్రామస్తులు వైద్యసేవలు పొందారు. దివ్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు వెయ్యి మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. వీరిలో 150 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని గుడివాడ మాజీ ఎంఎల్‌ఎ రావి వెంకటేశ్వరరావు, టిడిపి నేత ఎనిగళ్ల రాము, గ్రామ సర్పంచి రాకేష్‌కుమార్, టిడిపి నాయకులు బొర్రా చలమయ్య, కోడూరు శేషుబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బి.విజయలక్ష్మి, దావు నాగరాజు, బొంగు రవికుమార్, సిహెచ్.జగన్మోహన్‌రావు, గ్రామ ప్రముఖులు సందర్శించారు.



ముదినేపల్లి మండలంలో..



మెట్లపై ప్రవహిస్తున్న నీరు

చినవెంకన్న ఆలయంలో వేసవి రక్షణ చర్యలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చినవెంకన్న ఆలయానికి వచ్చే యాత్రికులు వేసవిలో ఆలయ ప్రదక్షణకు, క్యూలైన్లలో ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా యాత్రికులు రాకపోకలు సాగించే ప్రధాన రాజగోపురం రాతి మెట్లదారిలో ఎండవేడి పాదాలకు తగలకుండా రక్షణగా మెట్లదారిపై నీటిని విడుదల చేస్తున్నారు. ఆలయ ఆవరణలో కొబ్బరి పీచు కార్పెట్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో శ్రీవారి దర్శనార్థం వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం కొన్ని ప్రాంతాల్లో కూలర్లను ఏర్పాటు చేశారు. ఆలయ అనివేటి మండపం బయట ఉన్న జంట వృక్షాల నీడలోనూ, అనివేటి మండపంలోనూ కూలర్లు ఏర్పాటు చేశారు. అవసరానికి అనుగుణంగా యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సిఎం జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కైకలూరు మండలం ఆలపాడు, పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్లపాడు తదితర గ్రామసచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మంచి చేస్తున్న జగనన్నకు మద్దతుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంపిపి అడవి కృష్ణమోహన్, వైసిపి మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, సచివాలయ కన్వీనర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



కైకలూరు మండలంలో..

ద్వారకాతిరుమల : స్థానిక చెరువు వీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైసిపికే చెందుతుందన్నారు. సిఎం జగన్ పేదలకు అండగా నిలిచారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షమ పథకాలు తీసుకెళ్లి అందజేస్తున్నామన్నారు. ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారుజామునే వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు అందిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వపాలన నచ్చితేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రలను కోరారు. ఈ కార్యక్రమంలో గృహ సారధులు, వైసిపి నాయకులు చెలికాని రాజబాబు, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకటరావు, పెద్దిరెడ్డి జ్యోతి, సర్పంచి కుంటం స్వర్ణలత, చెన్నూరి రామకృష్ణ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో..

అనారోగ్య బాధితునికి స్నేహితులు సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చిన్ననాటి స్నేహితులు ఆర్థికసాయం చేసి ఔదార్యం చూపారు. మండలంలోని వెలగపాడు గ్రామానికి చెందిన కుమ్మరి ఏసుబాబు ప్రయివేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అంతేకాకుండా చిత్రకళాకారుడుగా పనిచేశాడు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడని విషయం తెలుసుకున్న 1991లో కామవరపుకోటలో పదోతరగతి చదివిన మిత్రులు రూ.55 వేలు సమకూర్చి వైద్యం నిమిత్తం ఏసుబాబుకు అందించారు.



ఆర్థికసాయం అందిస్తున్న పదో తరగతి స్నేహితులు

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల పదో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

11న పూలే జయంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆధునిక భారత ప్రథమ సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావుపూలే 196వ జయంతి ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు ఏలూరు ఆర్ఆర్ పేటలోని బిసి సబ్‌ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో వేదిక జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బిసి సబ్‌ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు జిల్లా కో-కన్వీనర్ ఆగొల్ల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11న జరిగే పూలే జయంతి కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



పార్థసారధిని సత్కరిస్తున్న వక్తలు

కనబడని అంగవైకల్యం హిమోఫిలియా

'సర్ సిఆర్ఆర్'లో అవగాహన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు

హిమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా ఆదివారం సర్ సిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మానవుని శరీరంలో రక్తం ప్రాముఖ్యత, రక్తకణాల పెరుగుదల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ హిమోఫిలియా కనపడని అంగవైకల్యమన్నారు. గత మూడు దశాబ్దాలుగా హిమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఉచితంగా రక్తమార్పిడి, శస్త్ర చికిత్సలు చేయటంతో పాటు మందులు అందించామని తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ నళిని పార్థసారధి అందించన సేవలను కొనియాడారు. ముఖ్య అతిథి, పద్మశ్రీ నళిని పార్థసారధి మాట్లాడుతూ మొదట వైద్యరంగంలో చిన్న పిల్లల స్పెషలిస్ట్ డాక్టర్‌గా పాండిచ్చేరిలో జీవితం ప్రారంభించి సేవలు అందిస్తున్న సమయంలో హిమోఫిలియా సమస్యలు, వాటికి సరైన వైద్యం, సాంకేతికత లేని సందర్భంలో ఆ విషయాల మీద కేంద్రీకరించి కృషి చేసినట్లు చెప్పారు. గత 30 సంవత్సరాలుగా హిమోఫిలియా సొసైటీని ప్రారంభించి భవనాలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తన సహాయ సహకారాలు, మిత్రులు, స్నేహితుల సహాయంతో ఆర్థిక వనరులు ఏర్పాటు చేసుకొని హిమోఫిలియా బాధితులకు చికిత్స, శస్త్రచికిత్సలు చేస్తూ పలు సేవలు దేశవ్యాప్తంగా అందిస్తున్నామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తనకు అందించిన పద్మశ్రీ అవార్డ్ హిమోఫిలియా సొసైటీకి, దానిలో పనిచేసిన అందరికీ చెందిందన్నారు. అనంతరం పార్థసారధిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ వంశీకృష్ణ, సర్ సిఆర్ఆర్.డిగ్రీ, పిజి కళాశాల కరస్పాండెంట్స్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, పిజి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ కెవిఆర్ఎన్ఎస్.కొండయ్యరావు, మహిళా కళాశాల ప్రిన్సిపల్ పి.శైలజ, అధ్యాపకులు డాక్టర్ రాము, ఝాన్సీ మాట్లాడారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్‌ను అభినందించారు. 700 మంది హిమోఫిలియా పేషంట్స్ వారి తల్లదండ్రులు, సొసైటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మేయర్ షేక్ నూర్జహాన్

తంగెళ్లమూడిలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - ఏలూరు

రంజాన్ పండుగను పురస్కరించుకుని ఏలూరు పట్టణ ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో ఆదివారం తంగెళ్లమూడి ధరస్‌గాహ-ఈ-ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ విందుకు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ నున్న స్వాతి కిషోర్, 40వ డివిజన్ కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, 16వ డివిజన్ కార్పొరేటర్ జుజ్జువరపు విజయనిర్మల, కార్యక్రమం నిర్వాహకులు అన్సారి పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించారు.

నేరాలు - ఘోరాలు



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న పర్వతనేని గంగధరరావు

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి గ్రామం దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెక్కపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగులు అయిన అక్కాతమ్ముడు కొయ్యూరి బసవపూర్ణ, కొయ్యూరి రవికుమార్ రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి మంటలు చెలరేగి పక్కపక్కనే ఉన్న రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు పర్వతనేని గంగధరరావు బాధితులను పరామర్శించి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు అక్కినేని చందు, తోట ప్రభాకర్ ఉన్నారు.

అభివృద్ధి పథంలో యండపల్లి పంచాయతీ

ఆదర్శంగా నిలిపేందుకు సర్పంచి యడ్ల మోహన్‌రావు కృషి



నూజివీడు సబ్ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సర్పంచి మోహన్‌రావు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని యండపల్లి పంచాయతీని సర్పంచి యడ్ల మోహన్‌రావు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. మండలంలోనే యండపల్లి పంచాయతీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచేలా ఎంఎల్‌ఎ, ఎంపిపి, జెడ్‌పిటిసి నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశానవాటికలు, సీసీ రోడ్లు, మంచినీటి బోర్లు ఇలా పంచాయతీలో రూ.కోట్ల అభివృద్ధి పనులు ఎంఎల్‌ఎ ఎలిజా సహకారంతో చేస్తున్నామని, ఇంకా చేస్తామని సర్పంచి యడ్ల మోహన్‌రావు చెబుతున్నారు.

చింతలపూడి మండలంలోని యండపల్లి గ్రామంలో 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా యడ్ల మోహన్‌రావు గెలుపొందారు. గెలిచిన దగ్గర నుంచి పంచాయతీకి ఏదోవిధంగా నిధులు తీసుకువచ్చి పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

పంచాయతీలో అభివృద్ధి పనులు

సర్పంచిగా పదవి భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 68 నూతన పింఛన్లు మంజూరు చేయించారు. రెండు కిలోమీటర్ల సీసీ రోడ్లకు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. ఎస్‌సి కాలనీకి రూ.12 లక్షలు, బిసి కాలనీకి రూ.ఆరు లక్షల నిధులు మంజూరు చేయించారు. ఎంపిపి నిధుల నుంచి రూ.16 లక్షలు, ఎంఎల్‌ఎ నిధుల నుంచి రూ.4.90 లక్షలు మంజూరు చేయించారు. బిసి కాలనీలో అంగన్‌వాడి కేంద్రం భవనాన్ని ఎంఎల్‌ఎ సహకారం రూ.ఆరు లక్షలతో నిర్మించారు. విద్యుత్ లో ఓల్టేజ్ వల్ల విద్యుత్ పరికరాలు కాలిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే 12 సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేయించారు. జలకళ ద్వారా యండపల్లి పంచాయతీలోనే 12 బోర్లు వేయించారు. పంచాయతీలో 86 నూతన గృహాలు, 96 ఇళ్ల స్థలాలు కేటాయించారు. మరో 12 ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎంఎల్‌ఎను కోరారు. 86 విద్యుత్ స్తంభాలు, జగనన్న లే అవుట్ ద్వారా రూ.4.50 లక్షలతో మంచినిటి బోరు వేయించారు. పంచాయతీలో తాగునీటి కొరత లేకుండా నాలుగు బోర్లు వేయించారు.



పైపులైన్లు నిర్మాణానికి తవ్వుతున్న గోతులు

గడపగడపకూ మన ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యండపల్లి గ్రామంలో 86 నూతన విద్యుత్ స్తంభాలు, జలజీవన్ పథకం కింద రూ.6.80 లక్షలతో పైపులైన్లు వేయించారు. యండపల్లి గ్రామంలో ఎస్‌సి, బిసి శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.4.50 లక్షలు మంజూరు చేయించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో యండపల్లి పంచాయతీలో సమస్యల పరిష్కారానికి రూ.9.80 లక్షలు మంజూరు చేయించారు. ఎస్‌టి ఏరియాలో రూ.4.80 లక్షలతో సీసీ డ్రెయినేజీలు, యండపల్లి గ్రామంలో రూ.6.50 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. ఎస్‌టి కాలనీ వాటర్ ట్యాంకర్ మరమ్మతులకు రూ.2.60 లక్షలు మంజూరు చేయించారు. రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ క్లినిక్, హాస్పిటల్, సచివాలయం, నాడు-నేడు నిర్మాణాలు కూడా ఆయన హయాంలో పూర్తయ్యాయి.



జగనన్న కాలనీలో బోరు నిర్మాణ పనులు

బిటి రోడ్డుకు రూ.1.20 కోట్లు

రాఘవపురం నుంచి యండపల్లి మల్లేశ్వరం మీదుగా రోడ్డు సరిగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. దీంతో సర్పంచి యడ్ల మోహన్‌రావు ఎంఎల్‌ఎ ఎలిజాను కోరి ఆ రోడ్డుకు నిధులు మంజూరు చేయించుకుని పనులు కూడా జరిగేటట్లు కృషి చేశారు.

పంచాయతీని జిల్లాలోనే ప్రథమస్థానంలోకి తీసుకెళ్తాం

యడ్ల మోహన్‌రావు, యండపల్లి సర్పంచి



మండలంలోనే యండపల్లిని అత్యధికంగా ఎంఎల్‌ఎ ఎలిజా సహకారంతో నిధులు మంజూరు చేయించుకొని అభివృద్ధి చేసుకుం టున్నాం. ఇంకా చేయాల్సిన అభివృద్ధి చాలానే ఉంది. ఎంపిపి, జెడ్‌పిటిసి సహాయసహకారాలతో యండపల్లి పంచాయతీని అభివృద్ధిలో జిల్లాలోనే మొదటి స్థానంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం.

సోషల్ వర్కర్స్ ఆధ్వర్యంలో వంతెనపై గోతుల పూడ్చివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఎర్రకాలువ వంతెనపై గోతులను సోషల్ వర్కర్స్ బృంద సభ్యులు పూడ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం కామవరపుకోటకు చెందిన సోషల్ వర్కర్స్ టీమ్ సభ్యులు ఎర్రకాలువ వంతెనపై ఏర్పడిన గోతులను సిమెంట్‌తో పూడ్చి మరమ్మతు చేశారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్స్ టీమ్ సభ్యులు పండూరి రామసాయి, వీరమళ్ల సౌజన్ సాయి మాట్లాడుతూ నిత్యం అనేక వాహనాలు ప్రయాణించే వంతెనపై ఏర్పడిన గౌతుల వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు స్వచ్ఛందంగా మరమ్మతు చేశామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లా కేంద్రం ఏలూరుకు రాకపోకలు సాగిస్తున్న వంతెనపై ఏర్పడిన గోతులను పట్టించుకోకపోవడంతో తాము స్పందించామని తెలిపారు. వంతెనపై ఏర్పడిన గోతుల్లో ఇనుప ఊచలు బయటపడి పలువురికి గాయాలైన సంఘటనలను గుర్తుచేశారు. వంతెనపై మరమ్మతులు చేయడానికి సుమారు రూ.మూడు వేలు ఖర్చు అయిందని తెలిపారు. కామవరపుకోట సోషల్ వర్కర్స్ బృంద సభ్యులు చేసిన మంచి పనిని పలువురు అభినందించారు.



వంతెనపై గోతులు పూడుస్తున్న సోషల్ వర్కర్స్ బృంద సభ్యులు

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా కేటాయించాలి



బ్యాండ్ పంపిణీ కారక్రమాన్ని ప్రారంభిస్తున్న గంగరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి వెయ్యి మంది జనాభా కలిగిన దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయాలని ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.రాంబాబు అన్నారు. పట్టణంలో దళిత పంచాయతీ సాధనకు గ్రామ జాత రిస్ట్ బ్యాండ్ పంపిణీ కార్యక్రమాన్ని పాతాళ గంగరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బోయగూడెంలో ఇంటింటికీ తిరిగి ప్రత్యేక దళిత పంచాయతీల ఆవశ్యకతను వివరించి, రిస్ట్‌బ్యాండ్‌ను చేతికి వేశారు. ఈ సందర్భంగా ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోకి ఎయిమ్ నాయకులు వెళ్లి ప్రత్యేక దళిత పంచాయతీల ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. దళిత వాడల అభివృద్ధి దళితులే చేసుకోవాలన్నారు. రోడ్లు, డ్రెయినేజీల గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసి సమావేశం నిర్వహించి చర్చించుకుని అభివృద్ధి చేసుకునేందుకు ప్రత్యేక దళిత పంచాయతీ ఆవశ్యకత అని తెలిపారు. ఇందుకు సకహరించాలని, అందరి సహకారంతోనే మనవాడ -మన పంచాయతీ సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజేంద్ర, ఏలూరు ఇన్‌ఛార్జి పోడేటి రాంబాబు, సైనిక్ కన్వీనర్ విల్సన్, వాసు ఆనంద్, బోడా ఆనంద్, కె.బుచ్చిబాబు, గోందిరాజు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు అవస్థలే : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి ప్రభుత్వం పెంచిన అన్ని రకాల నిత్యావసర వస్తు ధరలతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు విమర్శించారు. మండలంలోని వెలగపాడులో ఆదివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ధరలు తగ్గుతాయని అన్నారు. ప్రజలందరూ జగన్ పాలనపై విసుగు చెందారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలు టిడిపికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట అనిల్, సూర్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, జోనుబోయిన సోంబాబు, కొండపల్లి రవి, మెతుకుమిల్లి గోపాలరావు, గండబోయిన శ్రీను, అద్దంకి జగ్గారావు, కాసననేని మాధవరావు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పర్వాదినాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగ తర్వాత అంతటి ప్రాముఖ్యత ఈస్టర్ పండుగకు ఉంది. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా ఉన్న చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు ఈస్టర్ సందేశం అందించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో చిన్నారులు పలు నాటికలు ప్రదర్శించారు. పలు గ్రామాల్లోని చర్చిల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకని అన్నీ చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. ముదినేపల్లి, పెదపాలపర్రు, గురజ, వడాలి, సింగరాయపాలెం, చేవూరు, కాకరవాడ, వైవాక, అల్లూరు, కొరగుంటపాలెం, తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పండుగకు ముందు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాసం ఆచరించడం ఆచారంగా వస్తోంది. ఈ ఉపవాసాలు ఈస్టర్ పండుగతో ముగిశాయి.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం పంచాయతీ ముక్కంపాడు, ప్రగడవరరో పలు చర్చిల్లో ఈస్టర్ పండుగ పురస్కరించుకుని నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము తిరుపతిరావు, మానేపల్లి రాజారావు, ఆర్‌సిఎం చర్చి పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి గ్రేస్ మందిర్‌లో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బి.ఎజ్రాశాస్త్రి మాట్లాడారు. మండలంలోని దర్భగూడెం, లక్ష్మీపురంలో ఈస్టర్ పండుగ పర్వదినం సందర్భంగా ఉదయం నుంచే విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో, మోడియం బుజ్జి, కూరం వెంకటేశ్వరరావు, రాజా, సిరిశెట్టి రాఘవులు, పేరాబత్తుల డేవిడ్‌రాజు, చిలక నరసింహమూర్తి, దారం వెంకటేశ్వరావు, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

మండవల్లి : ఈస్టర్ పండుగను క్రైస్తవ సహోదరులు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. ఏసుక్రీస్తు సిలువలో మాట్లాడిన మాటలను గుర్తుంచుకొని తోటి వారితో ప్రేమతో మెలగాలని ఆయన సూచించారు. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ జీవించాలని ఆయన కోరారు. అనంతరం ప్రేమ విందును భుజించారు.

నూజివీడు రూరల్ : మండలంలో క్రైస్తవ సోదరులు ఆదివారం తెల్లవారుజామున, మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు పట్టణంలో ఆర్‌సిఎం టౌన్ ప్రార్థనామందిరం, సిఎస్‌ఐ టౌన్ ప్రార్థనామందిరాలతో పాటు అన్ని ప్రధాన మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవ దేవాలయాల్లో క్రైస్తవులు పండుగ జరుపుకొని స్వీట్లు పంచుకున్నారు.

కైకలూరు : మండలంలోని గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో క్రైస్తవ సోదరులకు, సంఘ పెద్దలకు ఈస్టర్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్ సైదు గాయత్రి సంతోషి, ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, సర్పంచులు సైదు వెంకటేశ్వరరావు, ఘంటసాల భాగ్యలక్ష్మి జగన్నాధం, ఎంపిటిసి సభ్యులు ఘంటసాల నాగమణి రామారావు, పార్టీ మండల అధ్యక్షులు తామరకొల్లు సర్పంచి భట్రాజు శివాజీ, గ్రామ సర్పంచి చెరుకూరి బాలరామరాజు, పెంచుకలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, పందిరిపల్లిగూడెం ఎంపిటిసి సభ్యులు బలే నరేష్, మాజీ సర్పంచి ఘంటసాల సీత ఆంజనేయులు, సైదు కామేష్, గణేష్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, మారయ్య, గ్రామాల పెద్దలు, వాలంటీర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చనిపోయిన తమ కుటుంబీకుల సమాధులపై పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి ఎడి.ఆశీర్వాదం, చర్చి సిఆర్‌డి ఇమ్మానియేల్ డెలిగేట్ జి.అబ్రహం, సంఘస్తులు, సంఘ పెద్దలు, సండే స్కూల్ పిల్లలు సెయింట్ పాల్స్ లూథరనచర్చిలో ప్రార్థనలు చేశారు.

టి.నరసాపురం : మండలంలోని ప్రకాషనగర్, బొర్రంపాలెం, టి.నరసాపురం, పుట్రేపు, మర్రిగూడెం, గండిగూడెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొందరు చనిపోయిన కుటుంబాలకు చెందిన సమాధులు అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రకాషనగర్‌లో క్రీస్తు పునరుద్ధారణ సువార్త దండయాత్ర నిర్వహించారు. ప్రార్థన ఆలయాల్లో పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు జి.జ్ఞానరాజు, కె.నిరీక్షణరావు, సిహెచ్.హెూషేయ, సిహెచ్.రమేష్, అకుల, ప్రసన్నకుమార్, డానియల్, చిన్నారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఈస్టర్ పండుగ వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. చొప్పరమెట్ల గ్రామంలోని బెత్లెహేం ఛారిటబుల్ ట్రస్టులో ట్రస్టు అధ్యక్షులు ఆచార్య డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు అందించడంతో పాటు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవ డాక్టర్ డి.సురేష్, డాక్టర్ బి.జాన్ బెన్‌హార్ హాజరయ్యారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ఈస్టర్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆర్‌సిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ పండుగకు ముఖ్య అతిథిగా చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా ఈస్టర్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, వైసిపి మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, మండల సచివాలయలా కన్వీనర్ గురజాల పార్థసారధి, అక్కంపేట సర్పంచి నాగేంద్ర, పంగిడిగూడెం సర్పంచి కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.